క్లుప్తంగా

చీఫ్ సెక్రటరీకి సాదర స్వాగతం



చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ మల్లికార్జున

గోపాలపట్నం: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. జవహర్ రెడ్డికి విశాఖ విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఆర్డీవో హుస్సేన్ సాహెహెబ్ ఆయనకు స్వాగతం పలికారు.

కలియుగ వెంకన్నకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరుడు

కంచరపాలెం: తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భాద్రపద మాస శుద్ధ అష్టమి సందర్భంగా శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో వెంకన్నకు ప్రత్యేకంగా అలంకరించి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, తులసీదళ బిల్వార్చనలు చేశారు. భక్తుల కోసం ప్రత్యేక దర్శనాలు కల్పించారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



మృతుని కుటుంబానికి నగదు అందిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీకి చెందిన బోండా వెంకట చిన్నారావు(నానాజీ) 38 అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. అతడు వైఎస్సార్ బీమా కలిగి ఉండడంతో భార్య చిన్నమ్మలుకు శనివారం వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు తక్షణ సాయం కింద రూ. 10 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ మిగిలిన రూ. 90 వేల నగదును మృతుడి నామినీ బ్యాంకు ఖాతాలో నేరుగా జమవుతాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏ ఒక్కరూ ఆర్థికంగా నష్టపోకూడదనే ఉద్దేశంతో వైఎస్సార్ బీమా ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు వరపల మహేష్, గృహసారథులు శరగడం హరి, పెంట్ల కేశవరావు, ఎస్సీ సంఘం ప్రెసిడెంట్ దేబార్కి కృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడిన వ్యక్తి మృతి

గోపాలపట్నం: విశాఖ నుంచి విజయనగరం వెళ్తున్న రైల్లో ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన గోపాలపట్నం రైల్వే స్టేషన్ వద్ద శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు కోల్‌కతా రాష్ట్రం ఉత్తర దుర్గాపూర్‌కు చెందిన అనుపమ్ చక్రవర్తిగా గుర్తించారు. మృతుడు మధురవాడ ఐటీ సెజ్‌లో పని చేస్తున్నాడు. ఇతర వివరాలు తెలియాల్సి ఉంది. హెచ్‌సీ రమణారావు దర్యాప్తు చేపట్టారు. మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

ప్రజలకు చేరువగా...

- జోన్-8 కార్యాలయంలో ప్రత్యేకంగా కాల్ సెంటర్ ఏర్పాటు
- పారిశుధ్య నిర్వహణకు స్పెషల్ డ్రైవ్
- అందుబాటులో అధికారులు



వేపగుంటలోని జీవీఎంసీ జోన్-8 కార్యాలయం

విశాఖ విద్య: ప్రభుత్వ నిర్ణయంతో అధికారులు ప్రజలకు మరింత చేరువయ్యారు. ఏ చిన్న సమస్య వచ్చినా నివేదించుకునేలా ప్రత్యేక సదుపాయాలు అందుబాటులోకి తెచ్చారు. ప్రతిసోమవారం నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంతో పాటు ఫోన్ ద్వారా కూడా సమస్యలు తెలియజేసే అవకాశం కల్పించారు. దీంతో జీవీఎంసీ జోన్-8 పరిధిలో ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతున్నాయి. ఎన్‌ఏడీ కూడలి మొదలుకొని పెందుర్తి వరకు గల పది వార్డుల్లో ప్రజానీకానికి ఏ సమస్య వచ్చినా మేమున్నాం అంటూ జోనల్ కార్యాలయ అధికారులు స్పందిస్తున్నారు.

జోన్ పరిధిలోని ప్రజల సౌకర్యార్థం కార్యాలయంలో ప్రత్యేకంగా కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు. జీవీఎంసీ 89 నుంచి 98వ వార్డుల పరిధిలో ప్రజలు తమ సమస్యలను కాల్ సెంటర్‌కు నేరుగా ఫోన్ చేసి చెప్పుకోవచ్చు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పారదర్శకంగా సేవలు అందించడానికి అధికారులు, సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని జోనల్ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు యంత్రాంగానికి దిశానిర్దేశం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జోనల్ కార్యాలయం పరిధిలో పనిచేసే వివిధ విభాగాల అధికారుల ఫోన్ నంబర్లు అందరికీ కనిపించేలా కార్యాలయం ప్రవేశ మార్గం వద్ద ఏర్పాటు చేయించారు.

పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక విభాగం

పారిశుధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రతీ రోజూ తెల్లవారుజామునుంచే కేటాయించిన ప్రదేశాల్లో పారిశుధ్య సిబ్బంది విధుల్లో ఉండేలా కార్యాచరణ సిద్ధం చేశారు. చెత్త తొలగించే వాహనాలు వార్డుల వారీగా అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు.

జీవీఎంసీ జోన్-8 అధికారుల వివరాలు

అధికారి పేరు	బాధ్యత	ఫోన్ నంబర్
ఎం.మల్లయ్యనాయుడు	జోనల్ కమిషనర్	9912349439
పి.వి.వి.ఎస్.శ్రీనివాసమూర్తి	సూపరింటెండెంట్	9848112030
కె.జయరామ్	అసిస్టెంట్ సిటీ ప్లానర్, టౌన్ ప్లానింగ్ విభాగం	8187899199
పి.వి.వి.ఎస్ శ్రీనివాసమూర్తి	రెవెన్యూ అధికారి, రెవెన్యూ విభాగం	9848112030
జి.కృష్ణంరాజు	అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్, పబ్లిక్ హెల్త్ విభాగం	9247457537
వై.వై.శ్రీరామ్	అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్, యూసీడీ విభాగం	7729999788
డి.వి.రమణమూర్తి	కార్యనిర్వహణాధికారి	8187897572
మాధవరావు	డీఈఈ, నీటి సరఫరా విభాగం	8187897599
కాల్ సెంటర్ ఫోన్ నంబర్		0891-2735353

సేవలు సద్వినియోగం చేసుకోండి



జోనల్ పరిధిలోని ప్రజలు జీవీఎంసీ పరిధిలోని సమస్యల పరిష్కారం కోసం నేరుగా కార్యాలయంలో తెలియజేయవచ్చు. అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉంటారు. జీవీఎంసీ పరంగా అందించే సేవలు సద్వినియోగం చేసుకోవాలి. జగనన్నకు చెబుదాం కార్యక్రమంతో పాటు ఫోన్ ద్వారా కూడా సమస్య తెలియజేయవచ్చు.

– ఎం.మల్లయ్య నాయుడు, జోన్-8 కమిషనర్, జీవీఎంసీ



కార్యాలయంలోని కాల్ సెంటర్

గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన



ఈసీజీ పరీక్షలు చేస్తున్న విధానాన్ని పరిశీలిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం గౌరీ కల్యాణ మండపంలో ఆడారి తులసీరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గుండె వైద్య శిబిరాన్ని వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయ కర్త, ఏటీఆర్ ట్రస్ట్ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ ప్రారంభించారు. సాధారణ పరీక్షలతో పాటు ఈసీజీ, 2డి ఎకో పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గుండె వైద్య నిపుణుడు శాంతారత్నం వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు అయితంశెట్టి గోపాలకృష్ణ, ఆళ్ల పైడిరాజు, మళ్ల శ్రీనివాసరావు, గౌరీ సేవాసంఘం సభ్యులు శరగడం అప్పారావు, గేదెల సరోజా, షేక్ రెహ్మాన్, రమణమ్మ, తులసి తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ అభివృద్ధికి కృషి



మర్రిపాలెం రైతుబజార్‌లో రైతులతో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డులోని మర్రిపాలెం రైతుబజార్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. శనివారం ఆయన ఈ రైతుబజార్‌ను సందర్శించారు. స్టాళ్ల నిర్వహణ, ఎంతమంది రైతులు భాగస్వామ్యులవుతున్నారనే విషయాలను ఈవో కొమ్మనాపల్లి వరహాలును అడిగి తెలుసుకున్నారు. రైతుబజార్‌కు కూరగాయలు తీసుకొచ్చి విక్రయిస్తున్న రైతులతో మాట్లాడారు. దుకాణాల నిర్వహణలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ మర్రిపాలెం పరిసర కాలనీ వాసులకు రైతుబజార్ ఎంతగానో ఉపయోగకరంగా ఉందన్నారు. దీన్ని మరింత అభివృద్ధి చేసేలా కృషి చేస్తానన్నారు. వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు, ఇతర నిత్యావసర సరకులను అందించాలన్నారు.

ఘనంగా సెయింట్ జోసెఫ్ కళాశాల స్నాతకోత్సవం



ఏయూ వీసీ ప్రసాదరెడ్డి చేతుల మీదుగా పట్టా అందుకుంటున్న విద్యార్థిని

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ఆధ్వర్యంలో శనివారం కళాశాల స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి హాజరై వేడుకలను ప్రారంభించారు. గ్రాడ్యుయేషన్ పూర్తయిన దాదాపు 300 మంది విద్యార్థినులు ఉపకులపతి చేతుల మీదుగా పట్టాలు, పతకాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ కాన్వకేషన్ నిర్వహణ పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఉత్తమ విద్యతో పాటు విద్యార్థినుల సంరక్షణ బాధ్యతను చక్కగా నిర్వర్తిస్తున్న కళాశాల యాజమాన్యాన్ని కొనియాడారు. విద్యార్థినులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కృషి చేస్తున్న కళాశాల అధ్యాపకులను అభినందించారు. హిందీ విభాగాధిపతి, ప్రెస్ ఇన్‌చార్జి పి.కె. జయలక్ష్మి వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో పలు విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం



వృద్ధురాలిని ఆశ్రమానికి తీసుకొస్తున్న మమత

విశాఖ విద్య: ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించిన వృద్ధురాలిని తిరిగి ఇంటికి తీసుకెళ్లేందుకు ఎవ్వరూ రాకపోవడంతో ఆమెకు ఎన్‌ఏడీ దరి బుచ్చిరాజుపాలెంలోని జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. కొన్ని రోజుల కిందట కేజీహెచ్‌లో వృద్ధురాలిని చేర్పించారు. ఆ తర్వాత ఎవరూ రాకపోవడంతో ఆస్పత్రి నిర్వాహకులు విషయాన్ని మమత చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ఎల్లేటి మమతకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆమెశనివారం కేజీహెచ్‌కు వెళ్లి వృద్ధురాలిని బుచ్చిరాజుపాలెంలోని జీవీఎంసీ షెల్టర్‌కు తీసుకెళ్లి వసతి, భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఆమెను బంధువుల వద్దకు చేర్చేంత వరకు ఆశ్రయం కల్పిస్తామని షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత తెలిపారు.

'ఉక్కు' పరిరక్షణ దీక్షకు సంఘీభావం



మాట్లాడుతున్న భోగవల్లి నాగభూషణం

మల్కాపురం: స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలనే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని జిల్లా ఇంటక్ ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం డిమాండ్ చేశారు. లేకుంటే కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న రిలే దీక్షలో శనివారం ఆయన పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఎప్పుడు అధికారంలోకి వచ్చినా.. ప్రభుత్వరంగ సంస్థలు, పరిశ్రమలను ప్రైవేటీకరించాలనే చూస్తుందన్నారు. కేంద్ర పాలకుల నిర్ణయాల వల్ల వేలాది మంది కార్మికులు రోడ్డున పడుతున్నారని పేర్కొన్నారు. ఇంటక్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దీపారాధన



కరాసలో దీపాలు వెలగిస్తున్న భక్తులు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు ఓల్డ్ కరాసలో శ్రీబంగారమ్మ-శ్రీదుర్గాలమ్మ ఆలయ కమిటీ, కరాస రాక్ స్టార్స్ ఏర్పాటు చేసిన మండపం వద్ద గణనాథుడికి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ దీపారాధన చేశారు. శనివారం రాత్రి మండపాన్ని సందర్శించిన ఆయన ప్రత్యేక పూజలు చేశారు. కాలనీ వాసులతో కలసి గణపతి ముందు దీపాలు వెలిగించారు.

గోపాలపట్నం ఆస్పత్రిలో వైద్య శిబిరం



శిబిరాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు



మందుల కోసం క్యూలో వేచి ఉన్న వ్యాధిగ్రస్తులు

గోపాలపట్నం: గోపాలపట్నం 30 పడకల ఆస్పత్రిలో శనివారం ఆయుష్మాన్ భవ ఆరోగ్య మేళా జరిగింది. ఉదయం నుంచి సాధారణ ఓపీతోపాటు వైద్య శిబిరం నిర్వహించారు. మహిళా వైద్య నిపుణులు, జనరల్ మెడిసన్, జనరల్ సర్జన్, పిల్లల వైద్య నిపుణులు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సూరాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ వైద్య శిబిరం నిర్వహించామని తెలిపారు. ఇవి ఈ నెల 27, 30 తేదీల్లో కూడా జరుగుతాయన్నారు. సుమారు 342 మందికి వైద్య పరీక్షలు చేశామని చెప్పారు. సాధారణ ఓపీ 107 కాగా ప్రత్యేక శిబిరంలో 170 మంది స్థానికులు పాల్గొన్నారని తెలిపారు. గైనిక్ విభాగంలో 55, జనరల్ సర్జరీ 25, జనరల్ మెడిసిన్ 28, పిల్లల వైద్య నిపుణులు 62 మందికి పరీక్షలు చేశారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, వైద్య సలహాలు అందించామని పేర్కొన్నారు. ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి కేసులో ఇద్దరికి రిమాండ్



దాడిలో గాయపడిన గణేష్

గోపాలపట్నం: విధులు ముగించుకుని గురువారం అర్ధరాత్రి సమయంలో వస్తున్న వ్యక్తిపై ఎన్‌ఏడీ జంక్షన్‌లో మద్యం మత్తులో కొందరు దాడికి పాల్పడ్డారు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఒక పత్రికా సంస్థ ఐటీ విభాగంలో పని చేస్తున్న మళ్ల గణేష్ విధులు ముగించుకుని వస్తూ పేపర్ కట్టను ఎన్‌ఏడీ జంక్షన్ స్టేట్ బ్యాంక్ వద్ద వేశాడు. ఆ సమయంలో వచ్చిన శాంతినగర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తుల్లో ఒకరైన దుర్గాప్రసాద్ పేపర్ కట్ట తీసుకెళ్లేందుకు ప్రశ్నించడంతో అందులో బాలుడు రాయితో దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితుడు ఎయిర్‌పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఇదే వ్యక్తులు కారు డ్రైవర్లపై దాడి చేసి వారి నుంచి రూ.2500 నగదు దోచుకున్నారు. దీనిపై కేసు మోదు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

ఘనంగా బెహరా జన్మదిన వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: వైఎస్సార్‌సీపీ నాయకుడు, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పుట్టిన రోజు వేడుకలు శనివారం అభిమానులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఆయన ఇంటి వద్ద పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ కేక్ కట్‌చేసి అభిమానులకు, నాయకులకు అందించారు. ఈ సందర్భంగా ఆడారి మాట్లాడుతూ బెహరా భాస్కరరావు విదేశీ పర్యటనలో ఉన్నా కూడా.. అభిమానులు ఈ విధంగా వేడుకలు నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, వ్యవసాయ మార్కెటింగ్ మాజీ చైర్మన్ బీఎస్ కృష్ణ, వార్డు అధ్యక్షులు అప్పలస్వామి నాయుడు గుణిశెట్టి శ్రీనివారావు, ఆడారి శ్రీనివాసరావు, సోమాదుల సురేష్, గళ్ల శ్రీను, చుక్క ప్రసాదరెడ్డి, నమ్మి శ్రీను, గేదెల మురళీకృష్ణ, కర్రి సత్తిబాబు, కర్రి అప్పలస్వామి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, బెహరా భాస్కరరావు అభిమానులు పాల్గొన్నారు.

ప్రజల్లో భయం తొలగించాలి

విశాఖ విద్య: రహదారి విస్తరిస్తే ఇళ్లు కోల్పోతామని ప్రజలు ఆందోళన చెందుతున్నారని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. గోపాలపట్నం బైపాస్ రోడ్డు 80 అడుగుల మేర విస్తరిస్తామని కమిషనర్ ప్రకటించిన నేపథ్యంలో జీవీఎంసీ 90,91వ వార్డుల్లో శనివారం ఆయన పర్యటించారు. ప్రజల్లో నెలకొన్న ఆందోళన తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడికి పూజలు.. అన్నసమారాధనలు



పూజా కార్యక్రమంలో యాదవ్ యూత్‌తో ఆడారి ఆనంద్‌కుమార్



చంద్రశేఖర అష్టకం ఆలపిస్తున్న మహిళలు



గొల్ల వీధిలో లలిత పారాయణ చేస్తున్న మహిళలు



గోపాలపట్నం రైతుబజారులో అన్నదానం చేస్తున్న యాసిన్



బుచ్చిరాజుపాలెంలో అన్నప్రసాదం వడ్డిస్తున్న ఏసీపీ నరసింహమూర్తి

విశాఖ విద్య: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు నియోజకవర్గంలో ఘనంగా జరుగుతున్నాయి. మండపాల్లో కొలువైన గణపతికి శనివారం ప్రత్యేక పూజలతోపాటు అన్నసమారాధనలు నిర్వహించారు. 52వ వార్డు మర్రిపాలెం రైతుబజార్ వద్ద భారీ అన్నదానం చేపట్టారు. ఈవో కొమ్మనాపల్లి వరహాలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మండపంలో గణనాథుడికి ప్రత్యేక పూజలు జరిపి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన ఈవో వరహాలును ఆయన అభినందించారు.

- వార్డులోని శాంతినగర్‌లో జియ్యాని విజయ్‌కుమార్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద మహిళలు చంద్రశేఖర అష్టకాన్ని భక్తిశ్రద్ధలతో ఆలపించారు.

పారిశ్రామిక ప్రాంతంలో..

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్ల వీధిలో యాదవ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పాల్గొని గణనాథుడికి జిల్లేడు పూలు, గరికతో పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్పొరేటర్ కొణతాల సుధ, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

- ఇదే ప్రాంతంలో నిర్వహించిన వినాయక పూజల్లో స్థానిక మహిళలు పాల్గొని లలిత పారాయణం పఠించారు.
- వార్డులోని ప్రకాష్‌నగర్‌లో కొలువుదీరిన గణనాథుడిని ఎమ్మెల్యే పి.గణబాబు దర్శించుకుని పూజలు చేశారు.
- 60వ వార్డు ఇందిరా కాలనీ, బర్మా కాలనీ, గుల్లలపాలెం ప్రాంతాల్లో జరిగిన అన్నదాన కార్యక్రమాల్లో కార్పొరేటర్ పి.వి.సురేష్ పాల్గొని వాటిని ప్రారంభించారు.
- వినాయక చవితి పూజా కార్యక్రమాలు, ఊరేగింపు సంబరాల్లో వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ, పార్టీ 63వ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహన్‌రెడ్డి(రాము), వార్డు అధ్యక్షుడు జీవీఎస్ఎన్ రాజు, నూకరెడ్డి, మళ్ల ధనలత, చట్టి నూకరాజు యాదవ్ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. 61వ వార్డులో జరిగిన దీపారాధనలో ఆడారి ఆనంద్‌కుమార్ పాల్గొని భక్తులతో కలిసి ఓం కారం పఠించారు.

గోపాలపట్నం రైతుబజార్‌లో..

గోపాలపట్నం: గోపాలపట్నం రైతుబజార్‌లో నిర్వహించిన అన్నదానాన్ని జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి యాసిన్ ప్రారంభించారు. 2 వేల మంది భక్తులు, రైతుబజార్ ఈవో నారాయణరావు, శివ, పలువురు రైతులు పాల్గొన్నారు.

- బుచ్చిరాజుపాలెం పైడిమాంబ కాలనీలోని దేవి ఇమేజెస్ దుకాణం వద్ద వినాయక మండప ఆవరణలో భారీ అన్నదానం జరిగింది. ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయనను గంట్ల ప్రసాద్ ఘనంగా సత్కరించారు. స్థానికులు పాల్గొన్నారు.
- జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలో పలు వినాయక మండపాలను వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ దర్శించుకున్నారు. అలాగే ఇంటర్‌లో 900 మార్కులు వచ్చిన ముగ్గురు విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించారు.

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్, ఎస్సార్ కాలనీ, త్రినాథపురం, అంబేడ్కర్ కాలనీ ప్రాంతాల్లో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమాలను ముఖ్య అతిథి కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ప్రారంభించారు.

- 62వ వార్డు ప్రకాషనగర్‌లో నిర్వహించిన అన్నదానాన్ని ముఖ్య అతిథి ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.
- 63వ వార్డు చింతల్లోవలో వినాయకుడికి ఎమ్మెల్యే గణబాబు, కార్పొరేటర్ గల్లా చిన్నా ప్రత్యేక పూజలు చేసి, అన్నసమారాధనను ప్రారంభించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.